


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### రెండు ప్రశ్నలు

**కాలింగ్‌బెల్** ఉన్నాకూడా ఎవరో తలుపు మీద ఆగకుండా బాదడంతో మధ్యాహ్నపు నిద్రలోంచి లేచిన వినయ కంగారుగా వెళ్ళి తలుపుతీసింది.

లోపలకి దూసుకువచ్చిన తమ్ముడు దుఃఖంగా చెప్పాడు.

"అక్కా! బావ...బావ.."

అసలే కంగారుగా ఉన్న వినయ ఆ మాటలకి హడిలిపోయింది.

"ఏమైందిరా బావకి?" దాదాపు ఏడుస్తూ అడిగింది.

తన మాటల్లోని పొరపాటుని గ్రహించిన అతను కోపంగా చెప్పాడు.

"అయనకేం కాలేదే శుభ్రంగా గుండ్రాయిలాగా ఉన్నాడు. ఏడవకు."

వినయ లోపలికి వెళ్ళి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని పైటచెంగుతో తుడుచుకుంటూ వచ్చి తమ్ముడి ఎదురుగా కూర్చుని అడిగింది.

"ఏమైందిరా?"

"బావ ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసా?"

"ఏదో లోన్ రికవరీకి ఖమ్మం వెళ్తున్నానని చెప్పారు ఏం?"

"నీ బొంద. పిచ్చిమొహమా! నీకసలు బుద్ధిలేదు." గయ్‌మన్నాడు.

"అబ్బబ్బా! విషయం చెప్పరా." విసుక్కుంది.

"ఆయన ఎక్కడికీ పోలేదు. కృష్ణపరమాత్ముడిలా ఆ విశ్వద ఇంట్లో గారాలు పోతున్నారు."

"ఏంట్రా నువ్వు చెప్పేది?" వినయ అయోమయంగా అడిగింది.

"వివరంగా చెప్తాను అడ్డుపడకుండా వినవే. మా కొలీగ్ ప్రసాద్ ఇల్లు మారాడు. కొత్త అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడు. గృహప్రవేశం అంటూ ప్రత్యేకంగా చేయడంలేదు ఇవాళ భోజనానికి రమ్మన్నాడు. వాళ్ళ ఫ్లాట్ అనుకుని ఎదుటి ఫ్లాట్ బెల్ కొట్టాను. పనిపిల్ల తలుపు తీసి ప్రసాద్‌ది ఎదురిల్లు అని చెప్పింది. ఈలోగా ఆ ఇంట్లో నాకేం కనిపించిందో తెలుసా? బావ వద్దని తలూపుతుంటే, ఆవిడ స్పూన్‌తో ఏదో పెడుతోంది. నాకు ఒళ్ళు మండిపోయిందనుకో. ప్రసాద్ ఇంట్లో ఓ అరగంట ఉండి, నీకు చెప్దాం అని వచ్చా." ఊపిరి పీల్చుకున్నాడు.

"నువ్వు అపార్థం చేసుకున్నావేమోరా? రికవరీకి వెళ్ళారేమో?"

"నీ బొంద. ఏడోతరగతి తప్పినప్పుడు మొద్దువనుకున్నా కానీ మరీ ఇంత శుద్ధమొద్దువనుకోలేదు. బావ ఖమ్మం పోలేదు, కరీంనగర్ పోలేదు. ఆయన వాళ్ళింట్లో లుంగీలో ఉన్నాడే ఆవిడ ఆయన ఒళ్ళో కూర్చుని స్పూన్ ఫీడింగ్ చేస్తోంది. అర్థమైందా?"

వినయ నిశ్చేష్టురాలైంది.

"తలచుకుంటేనే ఒళ్ళు మండిపోతోంది. రాగానే అడుగు. ఏం చెప్తాడో చూద్దాం" తమ్ముడు ఆవేశంగా చెప్పాడు.

"ఏభై లేవు?"

"ఏంటి ఏభై లేవు?"

"బావకిరా. ఏభై ఏళ్ళుంటాయికదా!. ఈ బుద్ధులేంటి?"

"ముప్పైఏళ్ళకి ఉండచ్చా ఈ బుద్ధులు? అక్కాయ్ అయోమయంగా ఉండకే. తెలివి తెచ్చుకోవే."

"ఆవిడ ఎవర్రా? నీకెలా తెలుసు? పెళ్ళయిందా?"

"విశ్వద. ఆవిడ పెళ్ళెందుకు చేసుకుంటుంది పేద్ద ఫెమినిస్ట్."

"అంటే ఏంట్రా? పెళ్ళి చేసుకోకుండా పెళ్ళయిన మగాళ్ళతో తిరిగే వాళ్ళని ఆ మాటంటారా?" ఫెమినిస్ట్ అన్న పదం పలకలేక అడిగింది వినయ.

అక్కడికి వచ్చాక మొదటిసారి నవ్వాడు తమ్ముడు.

"దాదాపు అంతే. ఫెమినిస్ట్‌లు అంటే స్త్రీవాదులు. అంటే స్త్రీకోసం పోరాడతారు. మగవాళ్ళని ద్వేషిస్తారు."

"ఓహో! ఆవిడ మీ బావకి ఎలా తెలుసురా?"

"అది నువ్వు కనుక్కోవాలి. ఏ లోన్ కోసమో వచ్చుంటుంది"

"సరే నువ్వు వెళ్ళిపో."

అతను అక్క మొహంలోకి ఓసారి చూసి లేచి వెళ్ళిపోయాడు.

తలుపు వేసి లోపలికి వచ్చిన వినయ నిస్త్రాణగా కూర్చుండిపోయింది. భర్త ఇలాంటి పనిచేస్తాడని, అతనికి ఇలాంటి పరిచయాలు ఉంటాయని ఆమె కల్లో కూడా ఊహించలేదు. చదువులేదన్నమాటే కానీ తనలో ఏం లోపం ఉందని చరణ్ ఇంత పని చేసాడు?

తనేం చేయాలి? అతనితో పోట్లాడితే ఎక్కడికి వెళ్ళాలి? తల్లితండ్రులు లేరు. తమ్ముడు ఎంతకాలం తనని ఇంట్లో ఉంచుకుంటాడు? ఉద్యోగం చేసుకుని బతకడానికి చదువులేదు. విడాకులు తీసుకుని వచ్చే భరణంతో జీవించడం అనేది ఇంకా నీచం. అతను ఒద్దు అనుకున్నప్పుడు అతని డబ్బు కూడా వద్దనుకోవాలి. తనకి ఆర్థికంగా అండదండలు లేవు.

చివరికి ఈ విషయంలో ఏమీ తెలియనట్లే ఉండాలని నిర్ణయించుకుంది వినయ. ఆమెకి తెలిసిపోయిందని చరణ్ చాటుమాటు వ్యవహారాన్ని బహిరంగంగానే చేస్తాడనే భయం ఓ కారణమైతే, 'నా ఇష్టం. నీకు ఇష్టం లేకపోతే వెళ్ళొచ్చు' అని అతనంటే తనకి వెళ్ళడానికి చోటు లేదన్నది మరో కారణం.

చెప్పిన ప్రకారం మర్నాడు సాయంత్రం బ్రీఫ్ కేసుతో ఇంటికి వచ్చాడు చరణ్.

"ప్రయాణం బాగా జరిగిందా?" మంచినీళ్ళు ఇస్తూ అడిగింది వినయ.

"ఆc."

"స్నానం చేసిరండి. ఓ గంటలో వడ్డిస్తాను."

"సరే."

అతను సిగ్గుపడుతున్నాడేమో అనిపించింది వినయకి.

భోజనం చేస్తుండగా తమ్ముడు ఫోన్ చేసాడు.

"అక్కా అడిగావా?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"లేదురా."

"ఏం?"

"రేపు మధ్యాహ్నం ఫోన్ చేస్తారా" పెట్టేసింది.

"వినయా రేపు మధ్యాహ్నం మనింటికి నా ఫ్రెండ్ ఒకామె భోజనానికి వస్తుంది. వంటలన్నీ అద్భుతంగా ఉండాలి."

ఆ శుక్రవారం రాత్రి చెప్పాడు చరణ్.

"అదేంటి విచిత్రంగా? ఎప్పుడూ ఎవర్నీ ఇంటికి పిలవరుగా? ఎవరామె?"

అనుమానంగా అడిగింది వినయ.

"విశ్వద అని."

"మీ బేంక్‌లో పని చేస్తారా?"

"కాదు."

"మరి? మీ క్లాస్‌మేటా?"

"ఏంటీ ప్రశ్నలు? ఒక్క మనిషికి భోజనం పెట్టడానికి ఏడుస్తున్నావేంటి? ఆవిడ పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పాలా?" కస్సుమన్నాడు.

వినయ మౌనం వహించింది.

మర్నాడు నిద్రలేచినప్పటినించి చరణ్ హడావిడిగా ఇల్లంతా తిరిగి చూసాడు. ఇల్లు ఎప్పటిలా శుభ్రంగా ఉంది. అన్ని వస్తువులు తళతళలాడుతున్నాయి. ఐనా వాటిని అటూ ఇటూ మార్చాడు. ఏమేం వండాలో వినయ్‌కి చెప్పి, వండినవాటి రుచులు చూసాడు. పాయసం చేసినా, బయటకి వెళ్ళి స్వీట్స్, పండ్లు తీసుకు వచ్చాడు. వినయ మనసులోని ఆక్రోశం బయటకి కనపడకుండా అతను చెప్పినట్లు శ్రద్ధగా వంట చేసింది.

వంటయ్యాక మళ్ళీ స్నానం చేసి కాటన్ చీరకట్టుకుని జడ వేసుకుంది. మధ్యాహ్నం ఒకటిన్నరకి విశ్వద వచ్చింది. ఆమెని చూసిన వినయ 'బానే ఉంది కాని నాకంటే అందగత్తేం కాదు' అనుకుంది.

విశ్వద ఆమెవైపు పూర్తిగా చూడకుండానే చరణ్‌తో కబుర్లు చెప్పసాగింది. రెండు నిమిషాలు అక్కడ కూర్చున్న వినయ ఆమె తనని పట్టించుకోవడంలేదని అర్ధంకాగానే లేచి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

"తను వినయ" భోజనాల దగ్గర భార్యని పరిచయం చేసాడు.

"ఐటెమ్స్ అన్నీ బాగా చేసారండి. వెరీ టేస్టీ. చరణ్‌గారూ మీరేమైనా వండారా?" అడిగింది.

"ఛ" చెప్పి తమాయించుకుని మళ్ళీ చెప్పాడు.

"వినయ నన్ను వంటింట్లోకి రానివ్వదండి."

"మనమే గారాం చేసి వీళ్ళని నెత్తికెక్కించుకుంటున్నాం వినయగారూ. మీరు అన్నం వండితే ఆయన పప్పు వండాలి. మీరు కూర చేస్తే, ఆయన పచ్చడి చేయాలి. ఇట్లా శ్రమ విభజన ఉండాలండీ. అంతా మనం చేయకూడదు" విశ్వద నవ్వుతూ చెప్పింది.

వినయ భర్తవైపు చూసింది. స్వతహా అతనికి ఈ స్త్రీ పురుష సమానత్వంలాంటి మాటలు ఒళ్ళుమంట.

ఏడో తరగతిలో చదువుకున్న 'విజాతిధ్రువములు ఆకర్షించుకొనును' అన్న సూత్రం గుర్తొచ్చింది.

భోజనం ముగిసాక విశ్వద అడిగింది.

"ఆవిడ మంచి భోజనం పెట్టారు.. మరి పాన్ ఏది?"

"పాన్?" చరణ్ సందిగ్ధంగా అడిగాడు.

"అవును. కిళ్ళీ, స్వీట్ పాన్ అంటే నాకెంత ఇష్టమో" కళ్ళు పెద్దవి చేసి గారంగా చెప్పింది.

"ఓ.. సారీ. గుర్తులేదు. ఒక్క నిమిషం. తెస్తా."

బైక్ కీస్, హెల్మెట్ తీసుకుని బయటకి వెళ్ళాడు చరణ్.

వినయకి ఆకలవుతున్నా, ఆమె వంటరిగా ఉందని తనుకూడా డ్రాయింగ్ రూంలో కూర్చుంది.

విశ్వద ఫోన్‌లో మెసేజ్‌లు చూసుకుంటూంటే అడిగింది.

"మీ పేరు విచిత్రంగా ఉందండి. అంటే అర్ధం ఏమిటండీ?"

"మా బాబు పెట్టాడు. ఆయనకి వేమన ఇష్టంట. కొడుకు పుడితే వేమన అని పెడదామనుకుంటే నేను పుట్టాను. దాంతో విశ్వద అని పెట్టాడు. విశ్వదాభిరామ వినురవేమ గుర్తుందా?" అడిగింది.

"ఓ అదా? గుర్తుంది. మీరేం చేస్తారు?" అడిగింది.

"నేను ఫెమినిస్ట్‌ని అంటే స్త్రీవాదిని. మగవాళ్ళవల్ల అన్యాయమైపోయిన ఆడవాళ్ళ తరఫున పోరాడుతుంటాను. నిజానికి నాకు మగవాళ్ళంటే అసహ్యం" విశ్వద మొహం వికారంగా పెట్టి చెప్పింది.

"ఎందుకని?" వినయ ఆశ్చర్యపోయింది.

"వాళ్ళంతా దొంగలు, దోపిడీదారులేనండి. ఐ హేట్ మేల్ పిగ్స్. మగపందులంటే నాకు అసహ్యం. నా చిన్నప్పుడే ఈ అభిప్రాయం నాలో బలంగా నాటుకుపోయింది. మొదటి కారణం మా నాన్న. మా అమ్మ జీవితమంతా కడుపులు, పురుళ్ళే. అది మగతనానికి గుర్తనుకున్నాడు. తన ప్రతాపం ఊరందరికీ తెలియాలనుకున్నాడు. మేము మొత్తం పదిమంది సంతానం. నలుగురు పురిట్లోనే ఢాం. ఆరుగురం బతికాం కలుపు మొక్కల్లాగా." ఆవేశంగా చెప్పింది.

"మీ నాన్నగారేం చేసేవారు?" వినయ అడిగింది.

"పదిమంది సంతానం అని చెప్పాక కూడా మా నాన్న ఇంకా ఏం చేసేవాడని అడుగుతున్నారే" పెద్దగా నవ్వింది.

వినయ సిగ్గుపడింది.

"మున్సిపల్ స్కూల్లో టీచర్. ఇప్పట్లాకాదు. బతకలేని బడిపంతుళ్ళు అప్పట్లో. ఇంటినిండా బిలబిలా పిల్లలు. మా అన్నయ్య తర్వాత మేము వరసగా ఐదుగురు ఆడపిల్లలం. అన్నిటికీ కటకటే, అన్నిటికీ కొట్టుకోవడమే. ఒక ముక్కలో చెప్పాలంటే దరిద్రపు బాల్యం. అమ్మ పగలంతా ఈసురోమని పనిచేస్తూ, సాయంత్రం అయ్యేసరికి తల నున్నగా దువ్వి వేలుముడివేసి, అందులో పూలు పెట్టుకునేది. మేమంతా చింపిరి జుట్లతో, సరిపోని బట్టలతో ఉండేవాళ్ళం. ఈగోల భరించలేని మా నాన్న స్కూల్ నించి లైబ్రరీకి వెళ్ళి అక్కడే పుస్తకాలు చదువుతూ కూర్చుని ఎనిమిదింటికి ఇంటికి వచ్చేవాడు. అమ్మ ఆయన వెనకే తిరుగుతూ స్నానానికి నీళ్ళు పెట్టి, మాకు పెట్టకుండా దాచిన కూరలు, నెయ్యివేసి వడ్డించడం.. దానికంటే హీనంగా చేసేది. నా జీవితంలో నేను అసహ్యించుకునే మొదటి వ్యక్తి మా నాన్న." పళ్ళు పటపట కొరికింది.

వినయ సానుభూతిగా చూసింది. ఆమెకి అలాంటి అనుభవాలు లేవు.

"రెండో దరిద్రుడు మా అన్నయ్య. శరత్‌బాబు వాడిపేరు. మా బాబు లైబ్రరీలో శరత్ సాహిత్యం చదివి ఆ పేరు పెట్టాడు. వాడు ఎప్పుడు చూసినా ధుమధుమలాడుతూండేవాడు. మమ్మల్ని పేరు పెట్టి పిలిచేవాడుకాదు. విశ్కు.. ఓ బూతుపదం చేర్చేవాడు. ఓసారి అమ్మ గట్టిగా చెప్పింది. 'ఆడపిల్లల్ని, చెల్లెళ్ళని అలా తిట్టకూడదురా' అని. అప్పటినించి మా పేర్లకి చివర జంతువులని చేర్చి పిలిచేవాడు. మా చిన్న చెల్లెలు చిట్టిని చిట్టిగాడిదా అనేవాడు. నేను దున్నని. నా ఇంకో చెల్లి పంది.. వాడికంత పొగరు. ఈ సంసారం చూస్తే భయం. తర్వాత మా బాధ్యతని వాడే తీసుకోవాలేమో అనే చింత. దాంతో మమ్మల్ని పురుగులకన్నా హీనంగా చూసేవాడు. ద్వేషించేవాడు." ఆవేశంతో ఆమె మొహం ఎర్రగా మారింది. "ఈయనింకా రాలేదేంటి?" వినయ స్వగతంగా బయటకే అనేసి చరణ్‌కి ఫోన్ చేసింది.

"బషీర్‌బాగ్‌లో ఉన్నా. వస్తున్నా" చెప్పాడు.

"పాన్ కోసం అంతదూరం వెళ్ళారా?" ఆశ్చర్యపోయింది.

"ఇక్కడ పోలీస్ కంట్రోల్ రూం పక్కన కిళ్ళీ షాప్‌లో పాన్ చాలా బావుంటుంది. అందుకని వచ్చాలే. నువ్వు ఆవిడకి విసుగుపుట్టకుండా కబుర్లు చెప్తూండు."

తలనొప్పి, సారిడాన్ తెమ్మంటే జండూబామ్ రాసుకోమనే చరణ్ కిళ్ళీకోసం అంతదూరం వెళ్ళడం వినయకి విడ్డూరంగా తోచలేదు.

"ఆయన రావడానికి ఇంకో పావుగంట పడుతుందండి" చెప్పింది.

"మీ సంగతి చెప్పండి. మీ వివరాలేమీ చెప్పలేదు చరణ్" విశ్వద ఆసక్తిగా అడిగింది.

"నాకు పెద్ద కథేం లేదండి. అమ్మా, నాన్నలకి నేను, తమ్ముడు ఇద్దరమే. చాలా లేట్‌గా పుట్టాం. నాన్నకి మెడికల్ షాప్ ఉండేది. నేను సెవెన్త్‌క్లాస్‌లో ఉన్నప్పుడు ఎగ్జామ్స్ టైంలో నాకు టైఫాయిడ్ వచ్చింది. పరీక్షలు రాయలేదు. స్కూల్ తీసాక, నేను మళ్ళీ సెవెన్త్‌లోనే కూర్చోవాలని తెలిసింది. నా క్లాస్‌మేట్స్ ఎయిత్‌కి వెళ్ళిపోయారు. వాళ్ళు నన్ను చూసి నవ్వేవాళ్ళు. నా జూనియర్లు నా క్లాస్‌మేట్స్ అయ్యారు. వాళ్ళు నాతో సరిగ్గా ఉండేవాళ్ళు కాదు. దాంతో ఇంక స్కూల్‌కి వెళ్ళాను. చదువుకోను అని గోల పెట్టి మానేసాను. అమ్మా నాన్న చాలా చెప్పారు కాని నేను వినలేదు. ఇంకో స్కూల్లో చేర్పిస్తానన్నారు. ఒప్పుకోలేదు. మా తమ్ముడు బాగా చదువుకున్నాడు. నాతో ప్రైవేట్‌గా చదివించాలని చూసాడు కానీ నావల్ల కాలేదు."

"మీ తమ్ముడికి మీరంటే ఇష్టమేనా?"

"ప్రాణం. చిన్నప్పటినించి ఒకే ప్రాణంగా పెరిగాం. అమ్మ నాన్న పోయాక ఎంత బాధ్యతగా ఉంటున్నాడో! నాకు ఇంకో నాన్న మా తమ్ముడు" వినయ కళ్ళు తడయ్యాయి.

"మా అన్నయ్య మాతో మాట్లాడేవాడు కాదు. మా చేతపని చేయించుకోడానికే పిలిచేవాడు. రెండు నిమిషాలు ఆలస్యంగా స్పందించినా బెల్ట్‌తో కొట్టేవాడు దుర్మార్గుడు. ఈ నరకకూపంనించి బయట పడాలంటే చదువొక్కటే మార్గం అని అర్థమైంది. మాక్కూడా. వాడికి బాగా అర్థమైంది. మేమంతా బాగా చదివేవాళ్ళం. చిన్నప్పుడేమోకానీ పెద్దయ్యాక మా నాన్న మా చదువుకి ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదు. మా అన్నయ్య పి.హెచ్.డి చేసి యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరాడు. వాడికి పెళ్ళి సంబంధాలే రాలేదు. కారణం ఐదుగురు ఆడపిల్లల బాధ్యత. దాంతో మాకింకా నరకం చూపించేవాడు. చివరికి యూనివర్సిటీలోనే క్లర్క్‌గా పనిచేసే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళది కూడా మాలాంటి కుటుంబమే. మా వదినకి మా అన్నకంటే ఎక్కువ కోపం, అసహనం. ఇకనించి మేము ఇద్దరికి వెట్టి చాకరి చేసే పనివాళ్ళం అని ఆమెని చూడగానే నాకు అర్థమైంది. అప్పుడు నేను ఎం.ఏ తెలుగు చదువుతున్నాను. వాడి పెళ్ళయ్యాక సత్యనారాయణ వ్రతంకి వచ్చిన వాళ్ళకి నేను, నా చెల్లెళ్ళు వడ్డనలు, బొట్టుపెట్టి తాంబూలాలు ఇవ్వడంలాంటివి చేస్తున్నాం. అకస్మాత్తుగా నాకు ఎప్పుడూ వినని ఓ పెద్ద నవ్వు వినిపించింది. ఎవరా అని చూస్తే మా శరత్‌బాబు. మూడు నిద్రలకి వదినకి తోడుగా వచ్చిన ఆవిడ చెల్లెలితో వాడు జోక్స్ వేస్తున్నాడు. ఆ అమ్మాయి నవ్వుతూంటే, వీడింకా పెద్దగా నవ్వుతున్నాడు. సరసాలు. వాడి మొహంలో నవ్వు చూడటం అదే మొదటిసారి, అదే చివరిసారి. ఆ రాత్రే నేను ఇంట్లోంచి బయటకి వచ్చేసాను. ఫ్రెండ్స్‌తో ఉండి, ఫైనల్ ఎగ్జామ్స్ అయ్యాక, ఓ న్యూస్ పేపర్లో చేరాను. అప్పుడే నాకీ ఫెమినిస్ట్ భావజాలం నచ్చి స్త్రీవాదినైపోయాను. మా చెల్లెళ్ళందరూ కూడా పి.జి చదివి బాగానే సెటిలయ్యారు. నేను మాత్రం పెళ్ళి చేసుకోలేదు" అలసటగా ఆగింది.

"నా పెళ్ళి చాలా సమస్యయింది. చదువుకోని పిల్లని చేసుకోడానికి ఎవరూ ఒప్పుకోలేదు. చివరికి చరణ్ సంబంధం వచ్చింది. వాళ్ళు బాగా పేదవాళ్ళు. చరణ్‌కి ఉద్యోగం లేదు. నన్ను పెళ్ళిచేసుకుంటే ఉద్యోగం ఇప్పిస్తానని నాన్న చెప్పారు. దాంతో మా పెళ్ళయింది. చెప్పినట్లే తెలిసినవాళ్ళద్వారా ఆయనకి వైశ్యా బాంక్‌లో ఉద్యోగం ఇప్పించారు."

"ఎలాగైనా మీది చీకూ చింతా లేని లైఫ్." విశ్వద అసూయంగా చెప్పింది.

"ఏం లాభమండీ జ్ఞానం లేదు అంటాడు మా తమ్ముడు. ఆ అజ్ఞానంతోనే మిమ్మల్ని రెండు ప్రశ్నలు అడుగుతాను. సమాధానం చెప్తారా?" వినయ అడిగింది.

"అడగండి" విశ్వద నవ్వింది. వినయ ఏడోతరగతి వరకే చదివిందని తెలియగానే ఆమెకి కొంచెం చులకనగా అనిపించింది.

"మీకు ఆడవాళ్ళంటే సానుభూతి, మగాళ్ళంటే కోపం. అంతేకదా? "

"అవును. తండ్రి, అన్న, భర్త, కొడుకు ఏ పోస్ట్‌లో ఉన్నా మగాడు చెడ్డవాడే బాధించేవాడే ఆడవాళ్ళెప్పుడూ బాధితులే" ఆవేశంగా చెప్పింది.

"మరైతే నేను ఆడదాన్నేగా నన్నెందుకు బాధపెడుతున్నారు? చెడ్డ మగాడైన మా ఆయన్ని మీరెందుకు సుఖపెడుతున్నారు?" అమాయకంగా అడిగింది వినయ.

ఇంటి బయట చరణ్ బైక్ ఆగింది. !!!

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments